సరదా రమణీయం

ప్రాప్తి

మంగళవాయిద్యాలతో సహా ఫెళ్లుమంటూ పెళ్లయేసరికి భళ్ళున తెల్లారింది. వాయిద్యగాళ్ళు వాద్యాలు మూటగట్టి సద్దుతున్నారు. మెత్తటి నిశ్శబ్దం ఏర్పడింది. తెల్లటి ఉదయాన చల్లటిగాలి వస్తూంటే పెళ్లి జరిగిన ఆ తోటలో కళ్యాణశోభ వెల్లివిరిసింది. పిల్లలు నిద్రలేచారు. పెళ్లిమంటపం శుభ్రం చేసి తరువాత కార్యక్రమానికి సన్నాహాలు సాగిస్తున్నాడు వియ్యన్నగారు.

అందరూ ముఖాలు కడుక్కుని కొందరు స్నానాలుచేసి మళ్ళా పందిట్లోకి చేరేసరికి ఫలహారాల ఆకులు పరిచివున్నాయి. పెద్దవాళ్ళు పెద్దరుగుమీద విడిగా కూర్చున్నారు – పెళ్ళికొడుకుతో మాట్లాడుతూ. పెళ్ళికొడుకు తమ్ముడు నరసు అక్కడికి చేరాడు కానీ వాళ్ళ మావయ్య గసిరాడు, "పెద్దవాళ్ళమధ్య నువ్వెందుకురా సత్రకాయవెధవా" అని.

పందిట్లో కూచున్న చిల్లర సత్రకాయలు ఫకాలున నవ్వారు. నరసుకి ఉక్రోషం వేసుకొచ్చింది. ఒక్కమాటు ఇటూ అటూ చూశాడు. అరున్నొకటి ఆలాపించాడు. కాళ్లు నేలకేసి బాదుతూ గట్టిగా, అస్పష్టంగా తిట్టుకుంటూ వంటింటికేసి బయలుదేరాడు. పెద్దరుగు చివరనే కూర్చున్నారు సుబ్రహ్మణ్యంగారు. పక్కనించి పోతున్న నరసు చొక్కా పట్టుకుని దగ్గరికి లాక్కున్నాడు. "లేదుబాబు, ఏడవకూడదు. మొగాళ్లు పైకి ఏడవరు. ఇక్కడ కూచో" అంటూ తనపక్క కూర్చోపెట్టాడు.

అరుగుమీద కూచున్న అరుగురు పెద్దలూ పెళ్లికొడుకూ బ్రహ్మాండం బద్దలయ్యేట్టు నవ్వారు – రిహార్సల్ వేసుకుని నవ్వుకి సిద్ధంగా వున్నట్టు.

నరసు ఏడుపుమాని బిత్తరపోయి చూశాడు. వాడికి సందేహం వచ్చింది – ఇప్పుడు వాళ్లు నవ్వింది తనని చూశా, సుబ్రహ్మణ్యంగారు ఏదో అన్నదానికా అని. ఏమైతేనేం, తను పెద్దాళ్లమధ్యన కూచున్నాడు. గర్వంగా చూశాడు పందిట్లో సత్రకాయలకేసి. కానీ వాళ్లంతా ఇడ్లీలోకి చట్నీ ఎక్కువ వేయించుకొనే గొడవలో పడివున్నారు. మళ్లీ సుబ్రహ్మణ్యంగారివేపు చూశాడు. ఆయన్ని చూస్తే దేముడు జ్ఞాపకం వచ్చాడు. దేముడు మంచివాడు. దేముడు అందరికీ సాయం చేస్తాడు. ఆ మాటకొస్తే అసలు అన్నీ ఇచ్చేది దేముడే.

నీరుకావిపంచె కట్టుకున్నాడాయన. కోలగా దోసకాయలావున్న పెద్దముఖం, వాలి గుబురుగావున్న మీసాలు. చక్కగావున్న పళ్లు, కళ్లుకూడా చాలా నచ్చాయి నరసుకి. సుబ్రహ్మణ్యంగారు ఎప్పుడూ ఏడవరుగామోసు. ఆయన ఏడిస్తే, కోప్పడితే ఎలా

వుంటుందో వాడికి తోచలేదు. ఎప్పుడూ నవ్వుతూ పలకరిస్తున్నట్టుంటాయి ఆయనకళ్లు.

అరుగుమీదకుక్కూడా ఇడ్లెన్లు వచ్చాయి. మడిగట్టుకున్న వంటబ్రాహ్మడు తెచ్చాడు, వేరే 'ఫెషల్' గిన్నెలో. ఆకులువేసి మంచి, మంచి ఇడ్లెనులు విరిగిపోనివి పెట్టాడు. పచ్చడికూడా చాలావేశాడు. వాళ్లన్నయ్యకి మాత్రం వెండిప్లేటులో పెట్టాడు. నరసు అన్నకేసి చూశాడు. వాడు తనకేసి చూడలే. అబ్బో వాడికెంత గొప్ప! ఎలాగయితేనేం వాడొక్కడికే పెళ్లయినట్టు.

సుబ్రహ్మణ్యంగారు వీపుతట్టారు. "ఊ! కానీ" అంటూ. అందరూ తింటున్నారు. వంటబ్రాహ్మడుమాత్రం వాగుతున్నాడు "అయ్యా మీకండీ-- అయ్యా మీకు-- ఒక్క జత--- అయ్యా మీకండి సుబ్రహ్మణ్యంగారు-- మొహమాట పడకండయ్యా--- అహాఁ. మీరు పారేసినా సరే వేసి తీరతా---- ఎలా పారేస్తారో."

సుబ్రహ్మణ్యంగారు నవ్వారు. "ఎందుకయ్యో ఆ బలవంతం. కావాలని ఏడుస్తున్న కుర్రవెధవలకెయ్యరాదూ! నాకు చాలు."

నరసు ఎడంపక్కనుండి నవలబడుతున్న ఇడ్లెనుగల నోరు ఏదో అంది. నరసు చూశాడు పక్కకి - సినిమాపాటలు రాశానని చెప్పే జలపాలకవి. పూర్వాశ్రమంలో ఈయనది పొరుగూరే. హఠాత్తుగా మాయమైపోయాడు. తరువాత పట్నంలో సినీమా కంపెనీలో అన్నయ్యకు కనపడ్డాడు; పెళ్లికొడుకు ఫ్రెండు. చాలామంది తనవేపు చూడగానే జనపాలకవి ఇడ్లెను మింగేసి అన్నాడు, "ఆ మాట నిజమేనండి."

"ఏమాట?" అన్నారు సుబ్రహ్మణ్యంగారు.

"అదే. అదే. ఇప్పుడు మీరన్నది."

"నేనేమన్నాను?" సుబ్రహ్మణ్యంగారు చాలా అమాయకంగా అడిగి, మంచినీళ్లు తాగుతున్నారు.

"హిహి-- హి--- అదేనండి మొహమాటం సంగతే. మీరన్నది నిజమేనన్నా."

అందరూ సుబ్రహ్మణ్యంగారివేపు చూశారు ఏమంటారోనని. నెమ్మదిగా గ్లాసుకిందపెట్టి ఆయన అన్నారు "నేనన్నది నిజమేనని నువ్వంటానంటావ్".

"ఆ! అంతేనండి" అన్నాడు కవి.

"ఐతే ఇపుడు నేనన్నది నిజం కాదన్నదెవరు?".

అంతా గొల్లున నవ్వారు. నరసుకూడా నవ్వాడు. కవి సకిలించాడు. పెళ్లికొడుకు మంచినీళ్ల గ్లాసు అడ్డం పెట్టుకున్నాడు కాబట్టే నవ్వాడో లేదో నరసుకి తెలీలా.

రోజూ పేపరు చదివే పంచాయితీ బోర్డుమెంబరు ఆవలిస్తూ అన్నాడు-

"హాఁ! ఏవిడోళంబ్లి! హాయ్! మనం ఉన్నవాళ్ళం తిన్నంతతిని పారేస్తున్నాం. లేనివాళ్ళు మనం పారేసినంత దొరికితే చాలని ఏడుస్తున్నారు. ఏవిడో! మరీ కరువొచ్చిపడిపోయిర్లి--- నెహ్రూ ఏదో చదువుతాడు ప్రణాళికలు."

ఎవరూ మాట్లాడలే.

జలపాలాయన ఏదో అనబోయాడు. కానీ అందరూ సుబ్రహ్మణ్యంగారివేపు చూస్తున్నారని వూరుకున్నాడో, లేకపోతే ఏమీ తట్టక ఊరుకున్నాడో? మొత్తానికి ఊరుకుని వేళ్ళాడుతున్న జనపాలకేసి చూచుకుంటున్నాడు.

సుబ్రహ్మణ్యంగారిలో విజ్ఞత వుందని అందరికీ తెలుసు. ఆ వెలుగు ఆయన కళ్ళల్లో అందరూ యిప్పుడు చూశారు.

ఈ సంగతి సుబ్రహ్మణ్యంగారు గ్రహించారు. అదే ఆయన గొప్పతనం. అడిగించుకొని మరీ చెబుతాడు.

పంచాయితీ మెంబరు కొంచెం జంకాడు, జనపాలాయనకి జరిగిన సన్మానమే తనకీ జరుగుతుందని.

సుబ్రహ్మణ్యంగారన్నారు "ఆఁ! అదేం మాటలెండి. ఉన్నవాళ్లు వున్నది తిన్నదాకా నమ్మకమేది! ఇంగ్లీషువాడు అననే అన్నాడు – చేతిముద్ద నోటికెక్కడాని కెన్ని అవాంతరాలో అని. ప్రాప్తం వుండద్దండీ – ప్రాప్తం!"

కొందరు "హుఁ" అన్నారు ముక్కుతో. ఇద్దరు పెదిమలు విరిచారు. ఇద్దరికిలించారు.

షావుకారు శేషయ్యగొంతుక వినబడింది. ఏమిటా! అని నరసు కుడివైపు చూచాడు. పెళ్లికూతురు అత్తయ్య గొంతుక అది. ఆవిడ కాఫీ తెస్తూ సుబ్రహ్మణ్యంగారి సూక్తులు విన్నదై, ఓపిక తెచ్చుకున్నదై ఈ విధంగా అన్నదైనది:

"హుఁ! అంతే బాబూ! ప్రాప్తం ఉండద్దూ – ప్రాప్తం!" సున్నితంగా అనాల్సిన వాక్యంకాస్తా పెళ్లి గోలలో వెలుగు రాచుకుపోయిన గొంతుక కోమటిశేషయ్యని గుర్తుకు తెచ్చింది. ఏమనుకుందో, ఆవిడ ఆ వాక్యం ఆపేసి "కాఫీ పుచ్చుకోండి బాబూ" అంది రహస్యం చెబుతూన్నట్టు.

సుబ్రహ్మణ్యంగారు ధనియాల కాఫీ తీసుకొన్నారు. రెండుగుక్కలు తాగి శూన్యంగా చూశారు. లేకపోతే ఆలోచనలో వున్నారో!

పంచాయితీ మెంబరు నసిగాడు.

సుబ్రహ్మణ్యంగారన్నారు: "ప్రాప్తం వుండొద్దూ. జ్ఞాపకం వుందోలేదో మీకు. ఆమధ్య అన్నిటి మీద కంట్రోళ్లు – పప్పుల దగ్గర నుంచీ కరువు. ఆఖరికి ఇడ్లీకూడా 'బాన్' చేశారు. మొహం వాచాం ఇడ్డెనుకీ, మినపరొట్టికీని. యుద్ధం రోజుల సంగతి నే చెప్పేది. అప్పుడు పట్నంలోవున్నా. పదిరోజులు పనిమీద వెళ్ళా. మా మేనత్త తోటికోడలు మొగుడు అక్కడ పని చేస్తున్నాడు. వాళ్లింట్లో బస." కాఫీ చల్లారిందేమో గడగడ తాగేశారు. పెళ్లికొడుకూ జనపాలాయనా సిగరెట్లు ముట్టించారు. నరసు హఠాత్తుగా లేచిపోయాడు. తోటలో వాళ్లబావ బీడీ తాగుతూంటే చూడడానికి. బావ మంచివాడు.

"ఆయ" అన్నాడు పంచాయితీ ఆయన పంచె బిగించి.

"అతగాడిపేరు రామావతారం. అవతారం అనేవాళ్ళం. ఏదో గుడ్డల కంపెనీలో పని చేసేవాడు. ఒఠి వెర్రిబాగులవాడులెండి. అతగాడిపెళ్లాం శాంతమ్మవుందే మహాయిల్లాలు. చల్లటివేళ తలుచుకోవాలి–" సుబ్రహ్మణ్యంగారు ఒక పట్టు లాగారు. పంచాయితీ ఆయన మరో పట్టడిగి మంచి చేసుకున్నాడు.

కాఫీ తెచ్చిన పిన్నిగారు చిన్నరుగుమీద కూచుని "హుఁ! అంతేనండి" అని బొంగురు గొంతుకతో ఆఫ్రికా కోకిలలాగ అన్నది. నరసు వాళ్లబావ బీడీ కాల్చడం పూర్తిగా చూసేసి గాలిదుమారంలావచ్చి సుబ్రహ్మణ్యంగారి దగ్గర కూచున్నాడు. ఆయన వాడ్ని దగ్గరకు తీసుకొని జుట్టు నిమురుతూ అవతారం కథ సాగించారు:

"పాపం, ఏం చేసేదో ఎలా తెచ్చేదో అన్నపూర్ణదేవిలాగ సుష్టుగా అన్నం పెట్టేది. నేనో పదిరోజులున్నాలెండి. కరువా కాటకమా అన్నారు. ప్రతిదానికీ కంట్రోళ్లే. మాంచి యుద్ధంరోజులు-- నిజంగా అబ్బాయ్! చెబుతా విను. తెల్లవాళ్ళూ తెల్లవాళ్ళూ చేసుకునే యుద్ధం పట్నంలో వున్న బియ్యం, మినపప్పు, కిరసనాయిలుతో కాదుగదా అనిపించేది. కొన్నాళ్లపాటు హోటళ్లలో కూడా ఇడ్డెన్లు లేక ప్రాణానికి మహా ఇదైపోయేది సుమా--- నేను వచ్చేసే ముందర కాబోసు. ఏదో పండుగొచ్చింది. పండుక్కి పొద్దున్న ఇడ్డెనలు, మధ్యాన్నం మినపరొట్టే, అవడలూ తిని తీరాలన్నాడు అవతారం. వాడిపెళ్లాం నవ్వింది "ఏదో శాస్త్రం చెప్పినట్టుందండీ" అంటూ.

అవతారం ధీమాగా నవ్వాడు.

"హు! నీకేం తెలుసే. సాయంత్రానికి అడ్డెడు మినుములు తేపోతే చూడు. మా ఆఫీసులో అందరికీ చెప్పేను. నాలుగైదు దుకాణాలవాళ్ళకీ ఇద్దరు హోటలు వాళ్ళకీ. ఆఁ! ఎల్లుండి పండక్కి నువ్వు మినపరొట్టె చేస్తావు – నేను తేనె ముంచుకుని తింటాను" అన్నాడు గుడ్లెగరేస్తూ.

"ఐతే బ్లాకులో తెస్తావుటోయ్?" అన్నా నేను.

"అబ్బెబ్బే. పలుకుబడిలెండి" అన్నాడవతారం మళ్ళీ గుడ్లెగరేస్తో.

అవతారం పెళ్లాం అంది తిప్పుకుంటూ "ఆఁ! పలుకుబడికేంలెండి, చాలావుంది గాని డబ్బుతగలేసి కొనబోకండి. నేను శేరుకొన్నాను నిన్న సాయంత్రం."

అవతారం మూర్ఛబోయినంత పని చెయ్యబోయి ఆఫీసుకి టైమవుతోందని కోటేసుకుంటూ చేతనైనన్ని వాక్యాల్లో పెళ్లాన్ని ఎడాపెడా పొగిడేసి బయటికి పోయాడు. నేను బజారు కెళ్లాను – ఏదేనాకొందామని. ఆ మూడోనాడే పండగ.

చంకలెగరేసుకుంటూ ఆఫీసు కెళ్ళాడవతారం. సరే ఒంటిగంటకి హోటలు కెళ్లాడట టిఫిను తిందామని. రెండుగంటలకి ఆఫీసుకొచ్చేసరికి అతగాడి బల్లమీద ఓ డాల్డాడబ్బా వుందట. ఆఫీసులో తోటి ఉద్యోగులు అవతారం స్నేహితులు ఆ డబ్బా చుట్టూ నుంచుని ఊహూ మురిసి ఇదైపోతున్నారు. అవతారం రాగానే అందులో ఐదారుగురు బండితోలేవాడి చప్పుడు చేశారు.

"కొట్టావయ్యా ఛాన్సు – మినపరొట్టె ఛాన్సు."

అవతారం తెల్లబోయి చూశాడు. పెద్ద మనిషిలా కనబడే మరో ఆయన అన్నాడు: "ఏమయ్యా ఎవరికో చెప్పావుటగా – మినుములు కావాలని. తెచ్చిపెట్టిపోయాడు. డబ్బుకి తరువాత వస్తాడట. నాకు సగంయిద్దూ" అని. అవతారం సంతోషాశ్చర్యసంభ్రమావ తారాలను వరుసక్రమంలో దాల్చాడు. ఇంట్లో మినుములున్న సంగతి వాళ్లకి చెప్పేసి ఇవి అమ్మేద్దామనుకున్నాడు. కానీ నోరురాలే. చవటనవ్వు నవ్వాడు అవతారం. "ఆ! ఇన్నాళ్లనించి మినపరొట్టికి బెంగెట్టుకున్నాయన మనకెందుకిస్తాడులే?" అన్నాడాయన. అంతా వాళ్ల వాళ్లపనులకి సర్దుకున్నారు.

సాయంత్రమయింది. డబ్బా చంకనెట్టుకుని బయల్దేరాడింటికి. బస్సుస్టాండు దగ్గర నించున్నాడు. అవతారం పొరుగింటాయన హఠాత్తుగా తటస్థించాడు. ఆయన "ఏమండోయ్ అంటే ఈయన 'ఏవండీ' అన్నాడు తరవాతాయన 'ఏమిటెవిశేషా'లంటే ఈయన 'ఆఁ! ఏముంటాయ్ విశేషా' లన్నాడు. ఇద్దరూ 'ఊఁ' అన్నారు.

ఊరుకున్నారు. ఆయన్ని చూస్తే అవతారానికి ప్రేమ ప్రకోపించింది. సినిమాలో ఇరుగుపొరుగులపాట గుర్తుకొచ్చింది. తనకెలాగా యింట్లో మినుములున్నాయికదా! ఇప్పుడు తన డబ్బాలో రెండు శేర్లుంటాయి. ఇంటి దగ్గరవి యీయనకిస్తే--- పిల్లలవాడు పాపం తింటాడు. అయినా వూరికేగాదుగా.

అవతారం అడిగాడు "ఏమండీ మినుములు కావాలా" అని. తృళ్లిపడ్డాడు ఆయన. ఆయనపేరు రామారావు. అవతారం వివరించాడు. 'ఈ డబ్బాలో అడ్డెడున్నాయండీ. ఇంటిదగ్గర ఓ శేరున్నాయి. మీక్కావలిస్తే ఆ శేరు తీసుకోవచ్చు.' రామారావుగారి కృతజ్ఞత కళ్లంట కారిపోయింది.

బస్సొస్తోంది. ఎవడో ఇంతలో అవతారం కోటట్టుకుని లాగాడు. వెనక్కి తిరిగాడు అవతారం. వాడన్నాడు "మీతో ఒక్కమాట."

అవతారం సందేహించాడు.

"చాలా అర్జంటు."

అవతారం బస్సువేపు చూశాడు. రామారావు బస్సులో వున్నాడు. "మీరెళ్లండి నేనొస్తా వెనకనించి" అన్నాడవతారం. బస్సు వెళ్లింది.

"ఊ! ఏమిటయ్యా?"

"అహ--- వేరేంలేదు. మీదగ్గర మినుములు నాకు అమ్ముతారా అని."

ఛర్రుమన్నా డవతారం. "నేనెందుకమ్మాలయ్యా? అమ్మడం ఎందుకు. ఎందుకమ్మటం?" అని.

అంతా అననిచ్చి వాడన్నాడు: "రెండు శేర్లకి అయిదురూపాయలిస్తా. డబ్బాకి పావలాకూడా."

పాతిక్షణాల్లో అవతారం ఆలోచించాడు. ఎలాగైనా అయిదురూపాయి లయిదు రూపాయిలే! రామారావుగారికి ఎగేసి ఇంట్లో శేరుతోటి తాను మినపరొట్టె తినొచ్చు. ఈ అయిదూ మరొకందు కుంటాయి.

"ఊఁ!" అన్నాడు.

అవతలవాడు అయిదురూపాయిల కాయితమిచ్చి డబ్బా పుచ్చుకున్నాడు. వెంటనే బస్సెక్కాడు.

అవతారం కాఫీతాగొచ్చి బస్సెక్కాడు.

ఆరుగంటలయింది అవతారం యిల్లు చేరేసరికి. నేనరుగుమీద కూర్చున్నాను. గుమ్మంలో కాలెట్టగానే ఆవిడడిగింది.

"ఏమండీ మినువులేవీ?"

"మినువులేమిటి?" బిక్కమొహం పెట్టాడవతారం.

"అదేనండీ! మీకాఫీసులో ఎవరో యిచ్చిపోయిన అడ్డెడూనూ"

"నీకెవరు చెప్పారు?"

"పొరుగింటి రామారావుగారు మీకు కనబడ్డార్టగా బస్సుస్టాండులో! ఇంటిదగ్గర శేరూ యిస్తానన్నారట. పాపం వచ్చి అడిగాడు. 'అమ్మా! ఆయనెపుడొస్తారో ఏమిటో ఆ గింజలిపుడేయిప్పిస్తే బాగుచేయించి నానేయిస్తాను' అన్నాడు. సరే ఆ శేరూ యిచ్చిపంపాను--- ఊహూ ఇదైపోయాడు వెర్రిబాగులాడు. పాపం పిల్లలు వాడాయె."

అవతారం అముదం తాగిన మొహం పెట్టాడు. తక్షణం తాగినకోతిలా తందనా లాడాడు. కోటు చింపేసుకోబోయి ఎందుకులే అని వుర్కూని పర్సు చొక్కాజేబులో పెట్టుకుని కోటు కిందపారేశాడు. "అడిగి తెచ్చెయ్ వాడ్ని మినువులు" అన్నాడు. "అసలు అడాళ్లతో వచ్చిమాట్లాడ్డానికి సిగ్గుండద్దా" అన్నాడు.

అతికష్టం మీదా అవిడా నేనూ వూర్కోబెట్టాం – "తప్పయ్యా వాళ్ల వింటేబావుండదు-- అసలు యిచ్చింది మళ్లా పుచ్చుకోడం మన వంశంలోనే లేదు" అని.

అవతారం వుపసంహరించుకున్నాడు----- ఇడ్లెన్లూ, అవడలూ గారెలూ – ముఖ్యంగా మినపరొట్టి అన్నీ హూత్! పండగ ఎండగైంది."

సుబ్రహ్మణ్యం గారాగారు. అందరికేసీ చూశారు అవతారం బాధ ఎవరెవరర్థం చేసుకున్నారోనని. అందరూ అఖండంగా అర్థం చేసుకున్నారు. తలకాయ లాడించారు. చ్చొ! చ్చొలు కొట్టారు. పంచాయితీ మెంబరు మాత్రం తన సానుభూతిని వాక్యీకరించాడు "రెంటికీ చెడ్డరేవడు పాపం!" అంటూ.

సుబ్రహ్మణ్యంగారు నవ్వారు. అయన నవ్వులో విజ్ఞతా, గర్వం పొంగిపొర్లాయి. "మీకిది మహాచిత్రంగా వుండచ్చు. ఇలాటివి నేను చాలా చూశాలెండి." అన్న అనుభవశాలిపోదా వెల్లివిరిసింది.

సుబ్రహ్మణ్యంగారు కథ సాగించారు:

"అక్కడితో అయిందీ! అవతారం పండుగనాడు మతిపోయినవాడిలా అయిపోయాడు. తెల్లవారుజాముున పక్కింట్లో పిండిరుబ్బిన చప్పుడు అవతారానికి మేలుకొలుపు. పిల్లల రాగాలు ఉపశ్రుతులు. ఇతగాడు ఊహూ పెరట్లోకెళ్ళడం యింట్లోకి రావడం. పదింటికి గారెలు చుంయ్యి చుంయ్యి మన్నాయి పక్కింట్లో.

అవతారం మరోమాటు పెళ్లాంమీద కంయ్యిమన్నాడు. పన్నెండింటికి మళ్ళా రోలుగొడవ. అవతారం విసుక్కున్నాడు. ఏమిటి వెధవ గొడవ. ఇల్లు ఖాళీచేసి పొమ్మను వాణ్ణి అని. రెండింటికి మినపరొట్టి సన్నాహాలు ప్రారంభం. అందులోకి ఏది నంచుకోవాలన్న విషయంపై యింటిల్లిపాది మధ్యా వాగ్వివాదాలు సాగుతున్నాయి. అవతారం మండిపడ్డాడు. 'ఎలాగయితేనేం చేశారు మినపరొట్టి. దానికి పెద్దగొడవా!' అన్నాడు. వెధవసొద అన్నాడు. వాళ్లకి తనమీద కసి అన్నాడు. అసలిదంతా తన భార్యా, పక్కింటాయనా పన్నిన కుట్ర అన్నాడు. "అమ్మా, నాకు తేనెకావాలి" అంటూ ఓ కుర్రవెధవ పక్కింట్లోంచి గావుకేక పెట్టాడు. దాంతో అవతారం నరసింహావతారం ఎత్తాడు. హఠాత్తుగా ఏదో జ్ఞాపకమొచ్చి సామాను గదిలోకి వెళ్ళాడు. బీరువా తలుపుతీసి తనివాళ తినవలసివున్న మినపరొట్టిలోకి నంచుకునేందుకు తెచ్చుకున్న తేనెసీసా చూశాడు. గొల్లుమన్నాడు. బావురుమన్నాడు. నానా ధ్వనులూ చేశాడు. ఎలా అయితేనేం పెళ్ళాం బలవంతాన నాలుగు చారుమెతుకులు ఎంగిలిపడ్డాడు."

పాపం! అన్నారయిదుగురు జాలిగా. ఇద్దరావలించారు. నరసుకి మాత్రం భలే కోపం వచ్చింది. 'వాళ్ళుకాస్త పంపకూడదా ఏం' అన్నాడు.

"అదీ అయింది! వాళ్ళు పంపింది ససేమిరా తిననన్నా డవతారం. అతగాడొద్దన్నాడని

అవిడా, వాళ్లిద్దరూ వద్దన్నారని నేనూ, ఆ కాస్త అలా వుంచేసాం" అన్నాడు సుబ్రహ్మణ్యంగారు విషాద స్వరంతో.

☆ ☆ ☆

మళ్లీ కథ సాగించారు:

"సరే మర్నాడవతారం ఆఫీసుకెళ్ళాడు. అందరూ అడిగారట మినపరొట్టెలావుందని. ఈ గొడవంతా వాళ్ళకెందుకు చెప్పడం అని అవతారం తన చిన్నపుడు కవిత్వం యావత్తూ గుర్తుకు తెచ్చుకుని మినువుల్తో చేయబడుతున్న, చేయబడబోయే, చేయడానికి వీలుగా వున్న వివిధరకాల పిండివంటల వివరాలు వర్ణించాడు. పుట్టతేనెతో, పంచదారతో, ఆవకాయతో మినపరొట్టె ఎంతెంత బావుంటుందో ధారాళంగా వర్ణించాడు. హఠాత్తుగా ఆగి వెనక్కి చూశాడు, ఎవరో చిరునవ్వు నవ్విన అలికిడయి. మళ్లా యిటు తిరిగాడు, యిటెవరో నవ్వారని. ఒక్కమాటుగా చుట్టూవున్న తోటి ఉద్యోగులంతా పగలబడి నవ్వారు."

సుబ్రహ్మణ్యంగారు ఆగి, వూపిరి పీల్చుకుని నెమ్మదిగా అన్నారు– "కిరాతార్జునీయం చదివారూ? ఈశ్వరుడూ అర్జునుడూ కూడా ఒక్కమాటే గురిచేసి వేసిన బాణాలు వరాహాని కెడాపెడా తగల్డంతోటే ఆయొక్క వరాహం నొప్పికన్నా యెక్కువయిన ఆశ్చర్యం తట్టుకోలేకా, నొప్పిసంగతి దేముడెరుగూ అసలు బాణం ఎటునించొచ్చిందో కనుక్కోవాలని అటూ యిటూ, యిటూ అటూ, మళ్ళా అటూ యిటూ మహావేగంతో తలతిప్పి చూసిందట. ఆ పుస్తకం రాసిన కవి అంటాడూ ఆ సమయంలో గనకా ఏ శోధనాగ్రయినా చెట్టెక్కి చూసినట్టయితే ఆ పందికి రెండు తలలున్నాయని ఆశ్చర్యపోనూ అని-- అదిగోనయ్యా అదే! సరిగ్గా అంతే. ఆవేళ అడివిలో ఆ వరాహం, యివాళ మళ్ళా ఆఫీసులో అవతారం, తల సమాన వేగంతో ఆడించారు. అందరూ నవ్వుతున్నారని నిర్ధారణకాగానే అవతారం తల ఆగింది. బిత్తరపోయి చూశాడు. పెద్ద గుమాస్తా అన్నాడు చివరికి– "చాల్లేవయ్యా అవతారం! మరీ పోకడలు పోతున్నావు మినపరొట్టె కవిత్వంలో. నీకసలు మినువు లెక్కడ దొరికాయంట? ఆవేళ డబ్బాలో పోసి నీ కిచ్చినవి మినువులు కావని యింటికెళ్ళగానే తెలీలా? మేమే దాంటో గంగ్రిడిసుక పోసిచ్చాం తమాషాకి. మామీదే కవిత్వం వెలిగిస్తున్నావ్" అంటూ నిల్దీసి అడిగాడు.

అవతారం ఏడవబోయి నవ్వేశాడు గబుక్కున.

★★★